క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: కాటేదాన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని సంబంధిత అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. శాస్త్రీపురం ఫీడర్ పరిధిలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నూర్‌కాలనీ, రిజ్వాన్ కాలనీ, కింగ్స్ కాలనీ తదితర ప్రాంతాలు. కింగ్స్ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శాస్త్రీపురం, ఓవైసీ కాలనీ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

బండ్లగూడ: హిమాయత్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్ల మరమ్మతులు కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. డాన్‌బాస్కో ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మైకెల్ కాలనీ, వినాయకనగర్, డీడీకాలనీ, కాళీమందిర్, ఎస్ఎఫ్‌సీ కాలనీ, ఆదర్శనగర్, ఎక్సైజ్ అకాడమీ, అభ్యుదయానగర్, అరుణోదయనగర్, సంధ్యానగర జీఆర్‌నగర్, మచ్చపల్లి ఎన్‌క్లేవ్. మిలట్రీ–2 ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ముఫైల్ టౌన్, విశ్వాస్‌టౌన్, హైదర్ ఎన్‌క్లేవ్, కపిలానగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

దేవాలయ వార్షికోత్సవాలకు ఆహ్వానం



ఎంపీ రంజిత్‌రెడ్డిని కలిసిన నాయకులు

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ పరిధిలోని రేణుకా ఎల్లమ్మ, మహంకాళి తల్లి దేవాలయ వార్షికోత్సవాలకు ను హాజరు కావాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మిద్దెల సురేందర్‌రెడ్డి, మిద్దెల సురేష్‌రెడ్డిల ఆధ్వర్యంలో మంగళవారం చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

‘ఎర్రకుంటను అభివృద్ధి చేస్తే ఇంత ప్రమాదం జరిగేది కాదు’



పుష్పశ్రీనివాస్‌రెడ్డి

బండ్లగూడ: అధికారులు అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయకపోవడంతో ప్రజల మృత్యువాత పడుతున్నారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ పుష్పశ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. హైదర్షాకోట్ సమీపంలోని హైవేలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వాకింగ్‌కు వెళ్లిన ముగ్గురు మృతి చెందడంతో ఆమె తీవ్ర దిగ్ర్భాంతికి గురయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా హైదర్షాకోట్‌లోని ఎర్రకుంటను అభివృద్ధి చేయాలని అధికారులను పలుమార్లు విజ్ఞప్తి చేశాగా గతేడాది ఫెన్సింగ్, పార్క్, వాకింగ్ ట్రాక్ తదితర అభివృద్ధి పనుల కోసం సుమారు రూ. 91 లక్షలు మంజూరయ్యాయన్నారు. కానీ ఈ వనులను పూర్తిస్థాయిలో చేయలేదనా్రను. ఎర్రకుంటలో అభివృద్ధి పనులు చేపట్టి ఉంటే ఇంత పెద్ద ప్రమాదం జరిగేది కాదన్నారు.

ఎంజీఐటీ విద్యార్థులకు ఎక్సలెన్స్ అవార్డులు



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సృజన

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులకు ఎక్సలెన్స్ అవార్డులు వచ్చినట్లు ప్రిన్సిపల్ చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో మేడిశెట్టి సృజన, మెకానికల్ ఇంజినీరింగ్‌లో విభాగంలో వేమూరి వెంకట సుబ్రహ్మణ్యం, మెకాట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో శరత్‌కు అవార్డులు వచ్చాయి. ఇటీవల రాష్ట్ర గవర్నర్ తమిళి సై చేతులమీదుగా అవార్డులు అందుకున్నారన్నారు.

‘బీజేపీ జెండా ఎగరడం ఖాయం’



స్వీట్లు తినిపించుకుంటున్న బీజేపీ నాయకులు

శంషాబాద్: రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి నియామకం కావడం హర్షణీయమని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్ అన్నారు. కిషన్‌రెడ్డి నాయకత్వంలో బీజేపీ నిర్మాణాత్మకంగా ఎదుగుతుందన్నారు. అనంతరం మిఠాయిలు పంచుకున్నారు. కిషన్‌రెడ్డి నాయకత్వంలో రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. కిందిస్థాయి నుంచి కేంద్ర మంత్రిగా ఎదిగిన కిషన్‌రెడ్డికి రాజకీయంలో అపార అనుభవం ఉందని రాష్ట్రంలో బీజేపీ ఎదురులేని శక్తిగా ఎదుగుతుందన్నారు. హరీష్, గణేష్, బంటి, సిద్దు పాల్గొన్నారు.



పల్లెచెరువును మట్టి వ్యర్థాలతో పూడుస్తున్న దృశ్యం

కబ్జా కోరల్లో పల్లె చెరువు..

అడ్డుకునేదెవరు!



రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి పల్లె చెరువు ప్రభుత్వం మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటిస్తుండగా కబ్జాదారులు మాత్రం ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు పావులు కదుపుతున్నారు. పట్టపగలే చెరువులో మట్టిని పోస్తూ చదును చేస్తున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు. ఉద్దెంగడ్డ ప్రాంతంలో పల్లె చెరువు ఉంది. ఈ చెరువు స్థానికంగా ఉన్న రైతులు పంటలను పండించేందుకు నీటిని తాగేందుకు గతంలో వినియోగించారు. రానురాను ఈ చెరువు పరిసర ప్రాంతాల్లో కాలనీలు, బస్తీలు వెలవడంతో పొలాలు కాస్తా కనుమరుగయ్యాయి. ఇదే అదునుగా కొందరు పల్లె చెరువును కబ్జా చేస్తూ నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. గతంలో నిర్మాణాలను కూల్చి వేసినా మళ్లీ యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడుతున్నారు. గతంలో పల్లె చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దుతామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఎలాంటి చర్యలు ప్రారంభించలేదు. ఇదే అదునుగా సమయం దొరికినప్పుడల్లా కబ్జాదారులు మట్టితో చెరువు స్థలాన్ని కబ్జా చేస్తూ షెడ్లు, నిర్మాణాలను చేపడుతున్నారు. ఇప్పటికే సగానికి పైగా చెరువు స్థలం కబ్జాకు గురైంది. ఉన్న చెరువునైనా కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ చెరువు కట్టపై ప్రతి ఏడాది దసరా ఉత్సవాలను నిర్వహిస్తారు. నగరంలోని గంగపుత్రులు ఈ చెరువు వద్ద ప్రతి యేటా జాతరను నిర్వహిస్తారు. అలాగే హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి జిల్లా పరిసర ప్రాంతాలకు చెందిన గణేష్ ప్రతిమలను ఇందులోనే నిమజ్జనం చేస్తుంటారు. ఉన్నతాధికారులు స్పందించి చెరువును కబ్జా కోరల్లోంచి పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

రైతుల అభ్యున్నతికి ఏరీస్ సంస్థ కృషి

ఏజీవర్సిటీ: వ్యవసాయ రంగంలో వచ్చే మార్పులను అధిగమించేందుకు మారుతున్న వ్యవసాయ నూతన పద్ధతులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు ఏరీస్ సంస్థ ఆధ్వర్యంలో ఏరీస్ ఫ్యూచురా–23ను రాజేంద్రనగర్‌లోని టీఎస్ సీఏబీ ఐసీఎంలో మంగళవారం నిర్వహించారు. మూడ్రోజుల పాటు జరిగిన ఈ వర్క్‌షాప్‌లో వ్యవసాయ రంగానికి చెందిన శాస్త్రవేత్తలు, వ్యాపార, పరిశ్రమల రంగంలో ప్రసిద్ధి చెందిన నిపుణులతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా అధునాతన పద్ధతులపై అవగాహన కల్పించారు. ఐసీఎం డైరెక్టర్ హెచ్ఎస్‌కె తంగిరాల ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు ఈ వర్క్‌షాప్ ద్వారా అధునాతన పద్ధతులపై ఏరీస్ సిబ్బంది రైతులకు ఇస్తున్న శిక్షణ అభినందనీయమన్నారు. అనంతరం ఏరీస్ సంస్థ చైర్మన్ డాక్టర్ రాహూల్ మిర్చందాని మాట్లాడుతూ.. 2023లో అంతర్జాతీయ మిలెట్స్ సంవత్సరంగా గుర్తించినందున రాబోయే రోజుల్లో వ్యవసాయ పంటలు, చిరుధాన్యాల మొక్క ఆవశ్యకత చాలా ఉందన్నారు. ఏరీస్ సౌత్ రీజన్ వైస్ ప్రెసిడెంట్ జయ ప్రదీప్ మాట్లాడుతూ.. ఏరీస్ సంస్థ రైతుల అభివృద్ధి కోసం కృషి చేస్తోందన్నారు.



సుగంధ ద్రవ్యాల ఉత్పత్తులను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

శంషాబాద్: విద్యారంగంలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అంబేడ్కర్ సేన జిల్లా అధ్యక్షుడు మహేష్, కార్యదర్శి మైలారం సుబ్రహ్మణ్యం డిమాండ్ చేస్తూ మంగళవారం మండల విద్యాధికారి రాంరెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో తెలంగాణ సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కారం కోసం ఆర్‌డీఓ కార్యాలయాలను ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా శ్రీధర్



శ్రీధర్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: బీజేపీ సిద్ధాంతాలను అంకితభావంతో ముందుకు తీసుకువెళ్తానని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.శ్రీధర్ అన్నారు. శ్రీధర్‌ను రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమిస్తూ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. పార్టీ ఇచ్చే ప్రతి పిలుపును విజయవంతం చేస్తామన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించినందుకు బండి సంజయ్‌తో పాటు సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు అన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



యాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజల బతుకులు మారుతాయని అందుకే కాంగ్రెస్ పార్టీని రానున్న ఎన్నికల్లో గెలిపించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి, కార్పొరేటర్ శ్రీనాథ్‌రెడ్డి, ఏ–బ్లాక్ అధ్యక్షులు డప్పు నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో 5వ డివిజన్‌లో మంగళవారం హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ..రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ. 500లకే గ్యాస్, వృద్ధులు, బీడీ, చేనేత కార్మికులు, వితంతులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, కల్లు గీత కార్మికులకు చేయూతగా ప్రతినెల రూ. 4 వేలు ఇస్తామన్నారు. పేద ప్రజల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పని చేస్తుందని దేశం, రాష్ట్రంలో పార్టీకి ఆదరణ పెరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సంగారెడ్డి, అంకం శ్రీనివాస్, బోగాల శ్రీనివాస్, తలారీ ప్రేమ్‌కుమార్, అరుణ, సువర్ణ, ఫనీ, సలీం, అజర్, సత్య, సందీప్, రవీందర్, రాజుకుమార్ పాల్గొన్నారు.

వినతి

శంషాబాద్: పట్టణంలోని న్యూహుడా కాలనీ రింగ్ టౌన్ శ్మశాన వాటికను మున్సిపాలిటీ అధికారులు నిర్వహణలోకి తీసుకోవాలని సామాజికవేత్త మాజీ సైనికాధికారి జనార్దన్ కోరారు. ఈ మేరకు ఆయన మున్సిపల్ చైర్ పర్సన్ సుష్మ, కమిషనర్ భోగీశ్వర్లుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. కొందరు వ్యక్తులు సంబంధిత స్థలం వద్ద ఫోన్ నంబర్లు రాసి పెట్టడం జరిగిందని శ్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు నిర్వహణను పూర్తిగా మున్సిపాలిటీ చేపట్టాలని వినతిలో కోరారు.

బోనాల ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో బోనాల ఉత్సవాల సందర్భంగా దేవాలయాల వద్ద భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలో ఈ నెల 9వ తేదీన బోనాల ఉత్సవాలను నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం ఆయన కనకదుర్గమ్మ గుడి, కట్ట మైసమ్మ దేవాలయం, ఉగ్ర పోచమ్మ దేవాలయం, నల్ల పోచమ్మ దేవాలయం తదితర దేవాలయాలను సందర్శించి పరిశీలించారు. దేవాలయాల వద్ద లైట్లు, బోనాలకు రహదారులను మెరుగుపర్చాలని, అవసరం ఉన్న చోట్ల తాగునీరు తదితర ఏర్పాట్లు చేయాలని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకు వచ్చారన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజలందరూ బోనాల ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ఆనందోత్సవాలతో జరుపుకోవాలన్నారు. కార్పొరేటర్ వెంట కృష్ణయాదవ్, భాస్కర్, అనిల్‌కుమార్, చిన్న, జంగయ్య, సురేష్‌ముదిరాజ్, దాసు ఉన్నారు.



దేవాలయం వద్ద స్థానికులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

వివాహిత అదృశ్యం



జ్యోతి

శంషాబాద్ రూరల్: ఓ వివాహిత అదృశ్యమైన ఘటన మున్సిపల్ పరిధిలోని గొల్లపల్లిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపల్లివాసి జ్యోతి(19) ఈ నెల 2న రాత్రి భోజనం చేసి పడుకుంది. తెల్లవారుజామున భర్త అజయ్ నిద్రలేచి చూడగా కనిపించలేదు. అన్ని చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రతిభ చాటిన సీబీఐటీ విద్యార్థిని



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సి.వెంకట నర్సింహులు

మణికొండ: హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 1వ తేదీన జరిగిన ఐడియా పోటీలో గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)లో కంప్యూటర్ సైన్స్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని స్వరాలిశర్మకు ద్వితీయ బహుమతి, రూ. 10 వేల నగదు, రూ.లక్ష ఇంక్యుబేషన్ స్థాపించేందుకు సహకారం లభించిందని ప్రిన్సిపాల్ సి.వెంకట నర్సింహులు తెలిపారు. ఆమెతో పాటు రూ. 10 వేల విజేతల జాబితాలో సాయి మహిత్, మణిచేగు, జువేరియా, అబ్దుల్ రహీం, మహమ్మద్ ఉన్నారన్నారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని అభినందించారు.

ఐఐహెచ్‌ఎంలో హాస్పిటాలిటీ స్కిల్ కోర్సు ప్రారంభం

గచ్చిబౌలి: అడ్మిషన్ రోజే ఉద్యోగం కల్పిస్తామని ఐఐహెచ్ఎం (ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్) చైర్మన్ డాక్టర్ సుబోర్న్ బోస్ పేర్కొన్నారు. మంగళవారం గచ్చిబౌలిలోని ఐఐహెచ్ఎం హైదరాబాద్ డైరెక్టర్ ఎర్నెస్ట్ ఇమాన్యుయేల్ పర్యవేక్షణలో వర్చువల్‌గా ‘హాస్పిటాలిటీ స్కిల్స్’ షార్ట్‌టర్మ్ కోర్సును ప్రారంభించారు. ఆతిథ్య రంగంలో నైపుణ్యం కల్గిన ఉద్యోగుల కొరత ఉందని,ఈ కోర్సులో చేరిన వారికి అదే రోజు ఉద్యోగం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. హయత్ కార్పొషన్ డైరెక్టర్ మోనం భట్టాచార్య, ప్రముఖ చెఫ్ చలపతిరావు పాల్గొన్నారు.

ఆరోగ్యబీమా నైపుణ్యాలను పెంపొందించేందుకు ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న అధికారులు

ఏజీవర్సిటీ: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ హైదరాబాద్(ఐఐపీహెచ్‌హెచ్), ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్సూరెన్స్ అండ్ రిస్క్ మేనేజ్‌మెంట్(ఐఆర్ఎ), జాయింట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్సూరెన్స్ రెగ్యులేటరి అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా, తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్యబీమా నైపుణ్యాలను పెంపొందించేందుకు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి.ఆరోగ్య భీమా ప్రత్యేక డొమైన్‌లలో దీర్ఘకాలిక సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలు మరియు పరిశోధన, ఉమ్మడి అకాడమిక్ కార్యక్రమాలు స్కిల్ డెవలప్‌మెంట్ పై దృష్టి సారించనున్నాయి.దీని ద్వారా ఆరోగ్య భీమా, ప్రజారోగ్య రంగాల సాధన కోసం నైపుణ్యాలను పెంపొందించవచ్చని తెలిపారు. ఇందులో ఐఐఆర్ఎం తరపున మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ సురేష్ మాథుర్, ఐఐపీహెచ్ డైరెక్టర్ డాక్టర్ మూర్తి సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వీవీకే మోహన్, డాక్టర్ శివకుమార్,రాజేష్‌తుండి పాల్గొన్నారు.

గర్భాశయ కేన్సర్ స్క్రీనింగ్ కృత్రిమ మేధస్సుపై సదస్సు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ మూర్తి

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ఇండియాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ కార్యాలయంలో మంగళవారం స్త్రీలకు సంబంధించిన గర్భాశయ కేన్సర్ స్క్రీనింగ్‌లో కృత్రిమ మేధస్సు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఇండియాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ మూర్తి పాల్గొని గర్భాశయ కేన్సర్ గురించి వివరించారు. గర్భాశయ కేన్సర్‌ను ఎదుర్కోవాలంటే ఈ వ్యాధి ప్రారంభంలోనే గుర్తించాలన్నారు. ఇది గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా జరుగుతుందని దీన్ని గుర్తించాలంటే వ్యాధి ప్రారంభ దశలోనే (వీఐ) విజువల్ ఇన్‌స్పెక్షన్ ఎసిటిక్ యాసిడ్ టెస్ట్ ద్వారా గుర్తించవచ్చని తెలిపారు. ఈ టెస్ట్ గురించి మహిళలకు అవగాహన కల్పించాలని అన్నారు. డాక్టర దిగుమర్తి లీలా మాట్లాడుతూ.. గర్భాశయాన్ని పరీక్షలు చేయడం ద్వారా ఈ కేన్సర్ గుర్తించడానికి సులువుగా ఉంటుందన్నారు. గ్రామీణ ప్రజలకు ఈ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు మహబూబ్‌నగర్ జిల్లాను పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకోవడం జరిగిందని ఈ జిల్లాలో ని గద్వాల్, నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్‌లో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పైలెట్ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ ఉషా రాణి, వివిధ ఆస్పత్రుల వైద్యులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని మేయర్ మహేందర్‌గౌడ్ తెలిపారు. బండ్లగూడ హెచ్‌పీ పెట్రోల్ బంక్ నుంచి కిస్మత్‌పూర్ వరకు బీటీ రోడ్డు పనులను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై స్థానికులు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. రోడ్డు పక్క ఉన్న వ్యాపారస్తులు, ప్రజలు రోడ్లను ఎక్కడపడితే అక్కడ తవ్వకాలు చేయవద్దని అభివృద్ధి పనుల కోసం తవ్వకాలు చేస్తే వెంటనే వాటికి ప్యాచ్‌వర్క్ చేయాలన్నారు. రోడ్లపై నీటిని వదలరాదని ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోని వర్షం, వృథా నీటిని అందులోకి మళ్లించాలన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలను అడ్డుకోండి

రాజేంద్రనగర్: నిరుపేదలైన తాము చిన్నపాటి గుడిసె వేసుకుంటే పదుల సంఖ్యలో పోలీసులు, రెవెన్యూ అధికారుల వచ్చి కూల్చివేసి ఇంటి సామగ్రిని రోడ్డుపై వేసే రెవెన్యూ సిబ్బంది బడా బాబుల అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకోవడం లేదని రాజేంద్రనగర్ ఏవీఎస్ కాలనీ వాసులు వాపోతున్నారు. ప్రభుత్వ స్థలంలో జీహెచ్ఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు లేకున్నా నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకోకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏవీఎస్ కాలనీలో గతంలో ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టి నిరుపేదలకు అందించారు. ఈ ప్రాంతంలో పూర్తిగా ప్రభుత్వ స్థలం ఉంది. ఏవీఎస్ కాలనీ మాత్రమే నిర్మాణాలతో నిరుపేదలు నివసిస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రభుత్వ స్థలంలో భారీ నిర్మాణం చేపడుతున్నారు. చిన్నపాటి గుడిసె వేసుకుంటేనే కూల్చివేసే రెవెన్యూ అధికారులు ఈ నిర్మాణం పట్ల ఎందుకు మౌనం వహిస్తున్నారో తెలపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. తాము ఫిర్యాదు చేస్తే నిమిషాల వ్యవధిలో సంబంధిత వ్యక్తులకు ఫోన్‌చేసి తమ పేర్లను వెల్లడిస్తున్నారని దీంతో వారు తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోతున్నారు.

హెచ్‌సీయూ–డ్రిల్స్ అవగాహనా ఒప్పందం

అకడమిక్, పరిశోధనా రంగాల్లో పరస్పర సహకారం



ఒప్పంద కార్యక్రమంలో పాల్గొన్న వీసీ ప్రొ.బీజేరావు, ఇరు సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: అకడమిక్, పరిశోధనా రంగాల్లో పరస్పరం సహకరించుకోవాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, డ్రిల్స్ సంస్థ నిర్ణయించాయి. ఈ మేరకు మంగళవారం హెచ్‌సీయూ, డాక్టర్ రెడ్డీస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ (డ్రిల్స్) మధ్య పదేళ్ల పాటు ఉమ్మడి విద్య, పరిశోధనా కార్యకలాపాల కోసం అవగాహనా ఒప్పందాన్ని కుదర్చు కున్నాయి. ఈ ఒప్పందంపై హెచ్‌సీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బీజేరావు సమక్షంలో హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్, డ్రిల్స్ సంస్థ కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, డ్రిల్స్ బోర్డు చైర్మన్ జీవి ప్రసాద్ సంతకాలు చేశారు. అధునాతన ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ రంగంలో విశ్వవిద్యాలయ విద్యార్థులు, పరిశోధకులకు నైపుణ్యాభివృద్ధికి డ్రిల్స్ సంస్థ మద్దతు ఇస్తుంది. హెచ్‌సీయూ నుంచి ప్రొఫెసర్ శర్మిష్ట బెనర్జీ, డ్రిల్స్ నుంచి డాక్టర్ శ్రీనివాస్ ఓరుగంటి సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారు.

గోధుమకు ప్రత్యామ్నాయం జొన్న

రాయదుర్గం: వాతావరణ సవాళ్ల నేపథ్యంలో గోధుమకు భారత్‌లో స్థిరమైన ప్రత్యామ్నాయంగా జొన్న అని తాజాగా నిర్వహించిన ఒక పరిశోధనలో తేలింది. గచ్చిబౌలిలోని ఐఎస్‌బీ సంస్థ ప్రపంచంలోని పలు సంస్థలతో కలిసి చేసిన పరిశోధన వివరాలను మంగళవారం ప్రకటించింది. కొలంబియా వర్సిటీ నుంచి పరిశోధకులు ఈ అధ్యయనం చేశారు. చైనీస్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ (చైనా), ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఇండియా), యూనివర్సిటీ ఆఫ్ డెలావేర్ (యూఎస్‌ఏ), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ముంబయి (ఇండియా) వాషింగ్టన్ స్టేట్ యూనివర్సిటీ(యూఎస్ఏ) బృందాలు కలిసి పరిశోధన చేశాయి. ఈ సందర్భంగా ఐఎస్‌బీలోని భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ అధ్యయన సహ రచయిత, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ అశ్వినిఛత్రే మాట్లాడుతూ రబీ సీజన్‌లో వాతావరణ–స్మార్ట్ వ్యవసాయ జోక్యాల తక్షణ అవసరాన్ని మా పరిశోధన హైలైట్ చేస్తుందన్నారు. సాంప్రదాయకంగా పెరిగిన జొన్న గేమ్ చేంజర్‌గా ఉద్భవించిందన్నారు. ఒడిశా రాష్ట్ర వ్యవసాయం, రైతుల సాధికారత శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ అరబిందపాఢీ మాట్లాడుతూ వరి లేదా గోధుమలకు సరైన ప్రత్యామ్నాయంగా మిల్లెట్, జొన్న గుర్తింపు పొందుతున్నాయన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు

ఆల్విన్‌కాలనీ: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు సుమారు 69 లక్షల 8వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే గాంధీ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. కార్పొరేటర్‌లు వెంకటేష్‌గౌడ్, శ్రీనివాసరావు, సత్యనారాయణ, రంగారావు, సంజీవరెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

‘కాల్ హెల్త్’.. ఇంటి వద్దకే వైద్య సేవలు

హఫీజ్‌పేట్: కాల్ హెల్త్ ద్వారా ఇంటి వద్దకే వైద్య సేవలు ప్రారంభించారు. మంగళవారం గచ్చిబౌలిలోని రాంకీ టవర్స్‌లో కాల్‌హెల్త్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పీబీఎస్ చౌదరి, డాక్టర్ అమానుల్లాలు మాట్లాడుతూ డాక్టర్లు, రక్త పరీక్షలు, బీపీ చెకప్, ఈసీజీ, డయాగ్నస్టిక్స్, సీజీఎం (కంటిన్యూస్ గ్లూకోజ్ మానిటరింగ్), ఈఈజీ (ఎలక్ట్రోనిసెపలోగ్రాం), హోల్టర్ మానిటరింగ్, ఆడియోమెట్రి, స్పీచ్ థెరపీ నిరంతరాయ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. కాల్‌హెల్త్ హెల్ప్‌లైన్, యాప్ ద్వారా ఈ సేవలను పొందవచ్చన్నారు.